


# డెవిల్

## సుషమ

"డూయూ బిలీవ్ డెవిల్స్...?"

ఆఖరిదాకా పీల్చి సిగరెట్ పీకను నలిపి యాష్‌ట్రేలో పడవేస్తూ అన్నాడు శేఖర్.

పలక్కుండా డీల్ చేసిన ముక్కల్ని సర్దుకుంటూ కూర్చున్నారు, మిగతా అంతా.

'పాస్' అన్నాడు శేఖర్. నిర్లక్ష్యంగా ముక్కల్ని అలా కలుపుతూ జార్లగిలబడ్డాడు సోఫాలో. కాసేపయినా కూచోకుండానే గబుక్కున మళ్ళా లేచి ముక్కల్ని టేబిల్‌మీద విసిరేశాడు శేఖరం. అందమయిన అమ్మాయి ఎత్తయిన ఎదమీది నించి జారి పడ్డ నైలాన్ పవిటలాగా సర్రున జారాయి అప్పుడే తీసిన కొత్త పేకలోని ముక్కలు టేబిల్ మీద.

శేఖర్ తరువాత రోజారమణి.

"నో. పాస్.' అంది. అంటూనే అదోలా శేఖరాన్ని చూచి ముక్కల్ని అటూ యిటూ కలిపి కింద పారేసింది.

"ఓ సా రేమయిందంటే..."

"మైడియర్ జంటిల్‌మెన్. మొదట ముక్కల విషయం కానివ్వండి. ఆనక తాపీగా మీ యిష్టమొచ్చినన్ని 'కాక్ అండ్ బుల్ స్టోరీస్' చెప్పుకుందురు గానీ..."

భార్గవ్‌ది కొద్ది కటువు స్వరం.

రంగధామ్ కిందుంచిన పేకలోంచి ఓ ముక్క తీశాడు. అనుకున్న ముక్కో లేక జోకరో వచ్చింది గామాల్ను కళ్ళో మారు మూసి కార్డుని లోపల యిరికించు కుని పనికిరాని దనుకున్న ముక్కని చేయింతెతెత్తి గట్టిగా ఠపీమని కొట్టేడు టేబిల్ మీద.

"నీవే డైసీ, ఊఁ. క్విక్." అన్నాడు భార్గవ్.

"యూ నాటీ బాయ్ డైస్ ఫోర్ ఎవరిదనుకున్నావ్ ?...ఎంత ఆట బాగ వచ్చుంటే మాత్రం మరీ అంత తొందరా ?" అంది తలనోసారి అలా విసురుగ్గా విదలించి డైసీ. డైసీకి మహా ఉంటే పాతికేళ్ళు లేదా ఓ రెండెక్కువ. అంతే. కానయితే చూడ్డానికి యింకా యిరవైయేళ్ళ కన్నెపిల్లలా కనిపిస్తుంది. బాబ్డ్ చేసిన జుత్తు విదేశాల నించి దిగు మతియయిన షాంపూ వాసనలతో గుప్పు మంటూంటోం దెప్పుడూ.

"డైసీ ! ఆ ముక్క యిచ్చి నన్ను ఆడిస్తున్నావ్ ?"

"సిల్లీ!" అంత పిరికివైతే, ఎందు కాడతావ్ రమ్మీ. ఆటలోనూ జీవితం లోనూ కొద్దిగా రిస్క్ తీసుకోపోతే ఎల్లా గోయ్ గన్నయ్యా!" గణేశ్‌కి డైసీ యిచ్చిన పేరది. పేరు గణేశ్ ప్రసా దయితే గణేశ్‌గా కట్ చేసుకున్నాడు. గణేశ్ అలా గన్నయ్య అయ్యాడు. ఆ గ్రూపులో గణేశ్‌ని డైసీ గన్నయ్యా అని పిలిచిం దగ్గర్నించీ అదే పేరే సార్థక మయిపోయింది.

"యస్ మిష్టర్ శేఖరం...? ఏదో చెబుతూ ఆపేశారు మీరు ?" అంది డైసీయే.

శేఖరం అంటే అదోవిధమైన గౌరవం అందరికి. శేఖరం చాలా ముభా వస్తుడు. అల్లా అని సీరియస్‌గానూ ఉండడు. చాల సరదా మనిషి. అలా అప్పుడప్పుడు శేఖరం యింట్లో పేకాట వేసుకుంటూంటారు.

"భార్గవ్‌కి కోపం రాదు గదా !" అన్నాడు కనుబొమలు పైకెత్తి కళ్ళని వెడల్పు చేసి మునిపళ్ళతో కింది పెద విని పట్టేసి.

"ఆటకి అడ్డురాకుంటే సరి. ఏద యినా చెప్పొచ్చు" అన్నాడు భార్గవ్. నోటినిండా సిగరెట్ పొగ పీల్చి ఉంటంచేత గాబోలు మాట లదోలా

ముద్ద ముద్దగా వచ్చాయి బయటికి పొగను కలుపుకుని.

"నే చెప్పేది ఆటకు అడ్డురానని హామీ యిస్తాను గానీ, చెప్పింది విన్నాక మీరే ఆటకి అడ్డుతెచ్చుకుంటారేమో ?"

"జంటిల్మెన్ కౌంట్ యువర్ కార్డ్స్" అంది డైసీ, రంగధామ్ వేసిన క్వీన్‌ని గబుక్కున తీసుకుని, చేతిలోని ముక్కల్ని ఒకటి పక్కన ఒకటి వరసగా అమరుస్తూ.

"అవి డేమేస్తోందో చూడకుండా ఆడితే ఎల్లాగయ్యా మరీనూ ? గంతలు కట్టిన గుర్రంలా ఒకే పరుగు. ఇది రమ్మీ ! పక్కవాళ్ళేమేస్తున్నారు, నేనే మెయ్యాలి అని చూచుకోపోతే ఎల్లా! ఇప్పుడే ఏ సిచ్చావు ఛ...ఛ...అన్నాడు భార్గవ్. తాను డీల్ చేయాల్సిన ఛాన్సు పోయిందేనన్న కోపంతో.

"డైసీ! ఆగాగు. ముక్కని పారేయబాక ! డిక్కట డిక్కు ! ఆ చివరి మదాము నేం చేస్తాం? సరిగ్గా చూసుకుని మరీ షో చెయ్. లేపోతే రూపాయ అచ్చుకోవాల్సొస్తుంది," అన్నాడు గణేశ్.

"ఓహో ! థాంక్స్ గన్నా థాంక్స్. సారీ పార్ట్‌నర్స్..." అంటూ ఏదో ముక్కని కిందేసేసింది తొందర్తొందరగా, డైసీ... ఆమెకి భార్గవ్ కేసి చూడాలన్నా భయంగానే ఉంది. బాగా కోపంగా రుసరుసలాడుతున్నాడు భార్గవ్.

"మిస్టర్ భార్గవ్ ?" అన్నాడు గణేశ్ స్పేడ్స్ పది వేసి అడందన్నట్లుగా చూపు విసురుతూ.

"వోకులు తగ్గించుకుంటున్నాడు..." కసి, కోపం, బాధా అన్నీ కలిపి ఒక్క వాక్యంలోకి కుదించి వేసినట్లుగా అన్నాడ్ భార్గవ్.

"నేను చెప్పబోయే కథ అంతా వింటానంటే నే మొదలెడతాను. లేదంటే...," శేఖరం అర్థోక్తిలో ఆపి అందరివంకా చూసాడు.

"ప్రొసీడ్ మైడియర్ శేఖరం..." అన్నాడు అందరిపరంగా భార్గవ్. నడినెత్తిన చూపుడు వ్రేలితో గోక్కుంటూ ఏ ముక్కను డిస్‌కార్డ్ చేద్దామా అని కొట్టుకు చస్తున్నాడు భార్గవ్. నాల్గు రౌండ్స్ తిరిగాక ముక్కలు అతి జాగ్రత్తగా వేయాలి అనేదాతని థియరీ.

"దెయ్యాలున్నాయా ?" అనేసి నిలిపేశాడు శేఖరం. అది తాను మొదలెట్టబోయే కథకి నాందీ వాక్యమో లేక నలుగురి అభిప్రాయం తెలుసుకోటానికి వేసిన ప్రశ్నో తెలీక తికమకపడ్డారు నలుగురూ మనసుల్లో. ముక్కల్ని చేతుల్లో పట్టుకొనే ఆశ్చర్యంగా అతని కేసి చూసారు. అంతా అయోమయంగా ఒక్కసారి పక్కగా ఉన్న కుర్చీని తిప్పుకుని శేఖరం మోకాలు తన మోకాలికి తగిలేలా కాలిమీద కాలేసుకుని మోచేతిమీదుగా ఊతతో చేతుల్లో తల

పెట్టుకొని కూచుని, రోజారాణి భయ మేసినట్లు భుజాల్నోసారి ఎగరేసి కళ్ళు మూసి తెరిచింది ఆ ప్రశ్న విని.

ఏమో అన్నట్లు పెదవి విరిచాడు మూగగా గణేశ్. మెడలో వేలాడుతున్న సిలువను అనుకోకుండా చేతికి తీసుకుని, తనలో తనే కళ్ళు మూసుకుని ప్రార్థించి కుడిచేతిని తొడమీద ఉంచుకుని చూపుడువేలిని మధ్య వ్రేలిమీద ఉంచింది సిలువలా క్రాస్ చేసి ధైర్యం తెచ్చుకోటాని కన్నట్లు డైసీ. ఆ ప్రశ్నతో భార్గవ్ మనసు కలవరపడిం దేమో పరధ్యాన్యంలో పడి... ఆట మరచిపోయి...,

"బైదిబై... జోకరేమిటి ?" అన్నాడు నిశ్శబ్దాన్ని చీలుస్తూ.

ఎక్కడో ఆలోచిస్తున్న ఇద్దరూ జవాబివ్వకపోయేసరికి, కిందున్న ముక్కల్ని జరిపి కట్ చేసిన జోకర్ ముక్కని చూచి,

"డెవిల్ ద కింగ్ !? కిం గ్నా జోకర్లా ?" అన్నాడు. అప్పటికీ భార్గ వ్‌ని చూచి ఎవరూ బదులు పలకలేదు. 'డెవిల్... డెవిల్' అని అనుకున్నారు, అంతే.

"మా యింట్లో ఉండేది ?"

"ఏవిటి దెయ్యవా ?" అంది కిల కిలా నవ్వుతూ జోక్ వేసినట్లుగా రోజారాణి.

"ఎగ్జాక్లీ" అన్న శేఖరం మాటలు విని ముఖంలో రంగులు మారిపోతే ఠక్కున నవ్వుని ఆపేసింది రోజారాణి.

"ఇంపాజిబుల్... !" అన్నాడు రంగధామ్.

"ఏది దయ్యవా ?"

"అవును !"

"ఎందుకని ?"

"లేదు గనుక !"

"మై డియర్ రంగధామ్! పాశ్చాత్య నాగరికతా ప్రభావంతో నేర్చుకున్న నాలుగు సైన్సు ముక్కల మిడిమిడి జ్ఞానంతో లేవన్నంతమాత్రాన అవి లేక పోవు. ఉన్నాయంటూనే అవి మీదొచ్చి పడవు... కానీ వాటి ఎక్జిస్టెన్స్ మాత్రం ఖచ్చితము."

"నేన్నమ్మను."

"నీవు నమ్మటం లేదన్న విష యాన్నే నేన్నమ్మలేకుండా ఉన్నా "

"ఎందుకో ?"

"ఆ నీ అపనమ్మకం మాటలవరకే గాబట్టి. నిజం తెలుసుకోవాలన్న ఆశ కానీ, ఎదిరించే ధైర్యం కానీ, లేదు కనుక."

"నాన్‌సెన్స్... !"

"పోనీ దేవుళ్ళున్నారంటావా ?"

"మేబీ ! దేవుడూ అని ప్రత్యక్షంగా ఓ పేరుతో పిలువను గానీ, ఉన్నాడని మాత్రం చెప్పగలను."

"చూడండీ నాన్ ఎగ్జిస్టెన్స్ పవర్స్

కొన్నిటి పైన నమ్మకం ఉన్న నీకు దెయ్యాలమీద లేకపోవటమేమిటి ?"

"రియల్లీ... ఐ హార్డ్లీ బిలీవ్ దీజ్ డెవిల్స్..."

శేఖరం వెంటనే జవాబియ్యలేదు. డైసీ, రోజాల కళ్ళు భయంతో అదోలా బెదరిపోతున్నాయి. రంగధామ్ నమ్మకం లేదంటూనే తొడమీద చేయుంచి వేళ్ళు లెక్కబెడుతున్నాడు. ఆంజనేయ జపం చేస్తున్నాడు గాబోసు. భార్గవ్ ఆ విషయంలో చాలాసీరియస్‌గా ఉన్నాడు. సగం బోధపడ్డట్లు సగం లేనట్లు ఉన్నాడు గణేశ్.

"సాయులయ్యా... !" కేకేశాడు శేఖరం, మసక మసకలు దాలుస్తోన్న హాలునోసారి చుట్టూ చూచి.

అయిదు నిమిషాలు గడిచాయి. సాయులయ్య రాలేదు. చీకటి మాత్రం పెరిగిపోతోంది, నల్లగా దెయ్యంలా ? ఊరికి బాగా దూరాన ఉన్న శేఖరం ఇంట్లోకి దగ్గరగా ఉన్న చెరువు మీది గాలి చల్లగా వీస్తోంది. చెరువుకి అటు పక్కనున్న స్మశానంలో ఏదో శవం కాలుతోంది. మంటలు ఆకాశానికి అంటు తున్నాయి వీస్తున్న గాలిని తోడు చేసు కుని దూరంగా అక్కడక్కడ మిణుకు మిణుకు మంటూ దీపాలు కనిపిస్తు న్నాయి. రోజారాణి ఇంకాస్త ముందుకు జరిగింది శేఖరాన్ని అంటుకునేట్లుగా ! డైసీకి ఆ అవకాశం కనిపించటంలేదు.

ఆట మధ్యలో గమనించనప్పుడు పోయిన కరెంటు ఇంకా రాలేదు. సాయు లయ్య బయటకు వెళ్ళినట్లున్నాడు. అతని పత్తాలేదు.

"...సాయులయ్య వచ్చి దీపాలు వెలిగించేదాకా ఆ టెల్లాగూ సాగదు కదా? మిస్టర్ శేఖరం. వై డోంట్యూ కంటిన్యూ యువర్ స్టోరీ... ! అఫ్‌కోర్స్ మీ కబ్జక్షన్ లేకపోతేనే..."

"బావుంది, నా కభ్యంతరం ఏమిటి? కానీ ముందస్తుగా ఆడవాళ్ళ పర్మిషన్ తీసుకోందే నేనేమీ చెప్పను అసలే వీక్ సెక్స్.చిమ్మచీకటి, ఒంటరిభవనం, దెయ్యాల కథ... ! ..."

డైసీకానీ రోజీకానీ నోరు విప్పలేదు.

"ఏమంటారు ?" భార్గవ్ గొంతుక అది.

"నాది వీక్‌మైండ్ గాదు." డైసీ అంది.

"మీ టూ !" రోజా తోడు పలికింది.

"నా. నా. నేనడుగుతున్నది మీ పర్మిషన్. యస్సార్ నో."

"యస్!" ఇద్దరూ ఒకేసా రన్నారు.

* * *

నాయుడికి భార్య పోయి కొన్నే ళ్ళయింది. మళ్ళీ పెళ్ళిచేసుకోవాలన్న ధ్యాస కలుగలేదు అతనికి. అయినవాళ్లూ బంధువులూ ఎంతో చెప్పారు. 'వయసేం పెద్దదా ? ముప్పయ్యేగదా ? పెళ్ళి చేసుకో ! జీవితాన్నిలా మోడువార

నీకు' అంటూ ఎన్నో విధాలుగా చెప్పారు. అన్నిటికీ పెడచెవి పెట్టాడు. నాయుడు పొద్దున్నే లేవటం, పొలానికి వెళ్ళటం సాయంకాలం ఎప్పుడో చీకటి పడ్డాక రావటం. వీలయితే ఇంత ఉడకేసుకునేవాడు. లేపోతే అలాగే పడుకునేవాడు.

పొలం పనులన్నీ అయిపోయాక ఆ రోజు అలా నదివెంట నడక సాగించాడు. దయ్యాల దిబ్బకి కొంచెం యిటు పక్కగా నది గట్టుమీద కూచుని ఏదో ఆలోచిస్తూండిపోయాడు నాయుడు. చిన్నగా ఒక పాయలా గలగల పారుతోంది సెలయేరు. ఆ అనుభూతిలో అలా ఎంతసేపున్నాడో తెలియదు. పరిసరాలన్నీ మరచిపోయాడు. తిరిగి చూచేసరికి వెన్నెల పరచుకొనుంది. అల్లంత దూరాన ఏదో కదలాడినట్లయితే అటుకేసి తిరిగి చూచిన నాయుడికి ఓ అందమైన యువతి తెల్లని చీరతో వయ్యారంగా నడచుకుంటూ వస్తోండటం కనిపించింది. క్షణంపాటు కలవరపడిపోయాడు. దయ్యాల దిబ్బ! రాత్రి... తెల్లని చీరతో సుందరి... ఒంటరిగా వస్తోంది. కానీ, ఆమె అందం చూచి ఆశ్చర్యపోయాడు. దయ్యం కాదుకదా అని మనసులో అనుకున్న అనుమానం, ఆ వస్తున్న స్త్రీ తన దగ్గరికి రాకపోవడం, తనని గమనించనట్లే గుడ్డలు విప్పేసి, స్నానానికి ఆ నదిలో దిగటం చూసాక, నిజము కాదనిపించింది. ఆ వెన్నెల్లో పోతపోసిన విగ్రహంలాగున్న ఆ చిన్నదాని నగ్న సౌందర్యాన్ని తనివితీర చూచి, ఆనందించాడు. ఆమె వెళ్ళిపోతోందన్న అనుమానం కలిగినప్పుడు, లేచి పోయి పలుకరిద్దామనుకుని ఆమె దగ్గరకు నడిచాడు నాయుడు. అలికిడి విన్న సుందరి నిమిషంపాటు నివ్వెరపోయి నట్లు చూచి, జారిన పైటను తొందర తొందరగా మీదికి కప్పుకుని విపరీతమైన వేగంతో పరిగెత్తిపోయింది దయ్యాలదిబ్బను దాటి. రెండో రోజు రాత్రి అదే సమయంలో అదే చోట నాయుడిని చూచిన సుందరి వెంటనే పరిగెత్తిపోలేదు. ప్రసన్నవదనంతో పరుగులాంటి నడకతో వెళ్ళిపోయింది. రెండు మూడు రోజులు గడిచాయి. నాయుడు సుందరి ఒకరినొకరు చూచుకుని నవ్వుకున్నారు. అయిదారు రోజులు గడిచాయి. ఇంకా దగ్గరకు చేరిపోయారు. ఆరేడురోజులు గడిచాయి. ఒకరి ఒడిలో ఒకరు ఉండిపోయారు.

"సుందరీ!"

"చెప్పు."

"పగలంతా ఎక్కడికి పోతావు?"

"ఇంకొడి దగ్గరకు మాత్రంకాదు."

"నీవెవడితో గడిపినా ఫరవా లేదులే."

"మరవుతే యిక నేం?"

"తెలుసుకోవాలని."

"అనవసరం."

అంతే. నాయుడికి ఇంకేం మాట్లా డాలో తెలిసేదికాదు. ముఖాన్ని ముద్దులతో ముంచెత్తేసేవాడు. పరవశించి పోయేది సుందరి.

"పెళ్ళి చేసుకుందామా ?"

"చేసుకోవాలనుందా ?"

"నీకు లేదూ ?"

"నీ మాటే నా మాట."

"అనే ఆశ..."

"నీ యిష్టం."

నెల రోజుల తరువాత మెళ్ళో తాళి కట్టి సుందరిని ఊళ్ళోకి నడిపించుకు వెళ్ళాడు. సుందరి అందాన్ని చూచి కళ్ళు గుచ్చుకున్నారు ఊరిలోని ఆడవారు. నాలికలు చప్పరించారు మొగ వెధవలు.

"నాయుడూ! అమ్మాయి దేవూరు ?" మునసబు ముచ్చటపడినట్లు నటిస్తూ అడిగాడు.

"తెలియదు."

"తెలీదూ ?... ఓహ్ ! వూరు తెలియదు. తండ్రిది "

"తెలియదు."

"కులమూ, గోత్రమూ...,"

"తెలియదు.

"మరేం తెలుసు ?"

"ఆమె !... నాకు నచ్చిన ఆమె అందం..."

"అవును. ఆమె అందం..."

అప్పుడే అటుకేసి వచ్చిన సుందరిని చూస్తూ చప్పరించాడు మునసబు. తల తిప్పి చూచిన సుందరికి మునసబు కనిపించాడు. మునసబు ముఖములోని మోటుతనం కనిపించింది. అంతే. కళ్ళెర్ర చేసి చూసింది ఆమె. ఆ చూపుల తాకిడికి తట్టుకోలేక పారిపోయాడు మునసబు.

"ఎవడాడూ ?"

"తప్పు. అడూ అనకు. ఆయన మునసబు."

"ఏం తప్పూ, దొంగవెధవ. వాడేమనుకుంటున్నాడో తెలుసా మనసులో ?"

"ఏవనుకుంటున్నాడు ?"

"నన్ను... నన్ననుభవించాలని !"

"నీకెలా తెలుసు ?"

"ఆడి లేకిచూపులు చూస్తే తెలీటంలా !"

"అట్టాంటి దేమైనా జరిగితే వాడి ప్రాణాలు..."

"ఆగాగు. నీదాక రానిస్తానా వాడి రక్తం నేను తాగేయనూ!"

సుందరిని గురించి ఏమేమో ప్రాకిపోయింది ఊళ్ళో. నాయుడినే అడిగేసారు కొందరు 'నిజమా' అంటూ. అందుకే నీవలా ఉన్నావు అన్నారు. నీ పటుత్వం పీల్చేసింది అన్నారు. జాగ్రత్త రక్తం పీల్చేస్తుంది అన్నారు కూడ.

"ఏంటలా ఉన్నావ్ ?" అంది

సుందరి. ఆవాళ సుందరి మరీ అందంగా అలంకరించుకుని ఉంది.

''ఏం లేదులే.''

''లే, ఏమిటీ ? ఏదో ఉంది చెప్పు ఏమిటది.''

''ఊరంతా కోడై కూస్తూంది.''

"నన్ను గురించే కదూ ?"

"నీకు తెలుసా ? ఎలా ?"

"ఎలా ఏమిటి ? నీవు నన్ను గురించి కాక ఇక దేన్ని గురించి బాధపడ తావు ?"

"ఏమనుకుంటున్నారో కూడ తెలుసా ?"

"తెలుసు."

"తెలుసా ? అందులో నిజమెంత !" సుందరి కళ్ళల్లోకి సూటిగా చూచి తటాలున చూపు దించేసుకుని సుందరి పాదాలని చూచాడు. అవి మామూలుగా ఉన్నాయి.

"నీకేమనిపిస్తూంది ?"

"అలా అనిపించటంలేదు."

"చాలు. ఇక వేరే ఎవరేమన్నా ఫరవా లేదు."

ఆ రాత్రే చెప్పింది రహస్యంగా నాయుడి చెవిలో తాను తొందర్లో తల్లి కాబోతున్నానని.

ఆరేడు నెల్ల తరువాత పండంటి కొడుకును చూచిన నాయుడు పరవశించి పోయాడు.

పండుకంటె నిండుగా ఉన్న సుందరిని చూచి మరీ పరవశించిపోయాడు, మునసబుగారు.

"చూడు. మునసబుగారింట్లో ఏదో పేరంటమంట. నిన్ను పంపమని చెప్పినారు. పోయిరా పో !" అన్నా డోరోజు నాయుడు కొడుకుని ఎగరేసి ముద్దు పెట్టుకుంటూ.

"మునసబుగారింటికా?" కళ్ళింతవి చేసి అడిగింది సుందరి.

"ఆఁ. మరేం ఫరవాలేదులే..."

''ఫరవా నాక్కాదు..."

"మరి..."

''ఆయనకి."

సుందరి వెళ్ళిపోయాక ఆమె మాటల్లోని భావం అర్థంగాక, ఎందుకైనా మంచిదని కొడుకునెత్తుకుని మునసబుగారింటికి బయలుదేరాడు నాయుడు. ముందుగదిలో నవ్వులు వినిపించాయి. అందులో ఒక నవ్వు నాయుడికి పరిచితమయిందే, సుందరిది. అలికిడి చేయకుండా కిటికీలోంచి ఏం జరుగుతుందో చూడసాగాడు నాయుడు వింతగా...

''సుందరీ !" అంటూ ముందుకు పోతూ మీద పడటానికి ప్రయత్నం చేస్తున్నాడు మునసబు.

"రా !..." అంటున్నాడు.

''ఆగండి దీపం..." సుందరి గొంతు అది.

నాయుడు కొంచెం కోపంతో తొంగి చూచాడు కిటికీలోంచి.

"ఉండనిద్దూ? అంత దూరం ఉంది. ఎవరూ చూడరు... రా."

"ఆహాఁ. వద్దు. ఆర్పివెయ్యి..."

"నిన్ను వదలి నేను ఒక్క అడుగు కూడా వేయను."

"పోన్లే నేనార్పివేస్తాను." అంది సుందరి. అంతే ఆ మాటన్న సుందరి చేయి పొడవు పెరిగిపోతోంది, పొడుగ్గా యింకా పొడుగ్గా దీపం అందేంత పొడుగ్గా. అలాగే గుడ్లప్పగించి చూస్తున్న మునసబు భయంతో గుండె ఠారుమని చచ్చిపోయాడు.

నాయుడు తను విన్నది నిజమే నను కుని సుందరిని అక్కడే వదిలేసి పరుగు తీశాడు. పరిగెత్తి పరిగెత్తి ఓ చోట ఆగి చేతుల్లోని బాబుని గబుక్కున వదిలేసి తిరిగి పరుగుపెట్టాడు. అది దయ్యం బిడ్డ అని అసహ్యంగా...

*   *   *

"ఫెంటాస్టిక్!... నేన్నమ్మను!" అన్నాడు రంగధామ్.

"బట్ యిటీజ ఫేక్..." శేఖరం అన్నాడు.

"నో. ఐ కాంట్ బిలీవ్ ఇట్... అయ్ కాంట్..."

చేయి పొడుక్కావట మేమిటీ? సిల్లీ..." భార్గవ్ అన్నాడు.

"కానీ అలాగే జరిగింది మరి."

"మీకెవరు చెప్పారిది."

"నాకు బాగా తెలుసు."

"అదే ఎలా?" అందరూ అదే అనుమానాన్ని వెల్లడిచేశారు ఏక కంఠంతో.

ఇంకా కరెంటు రాలేదులాగుంది. సాయులయ్య ఎప్పుడో ముట్టించి వెళ్ళి పోయిన బుడ్డీ లాంతరులోంచి, వత్తి బాగా అడుగుదాక కాలిపోయి చిన్నదిగా అయిపోవటంతో వెలుతురు తక్కువగా వస్తుంది. లేచి వత్తిని పెద్దదిగా చేస్తే బావుంటుందెవరైనా అని అందరూ అను కుంటున్నారు. కాని ఏదో భయం...! వత్తి...! దీపం...! పొడువు చేయి...! దయ్యం...! సుందరి...! అందరి మనసుల్లోనూ అదే భయమే!

అప్పటికీ శేఖరం ఏమీ మాట్లాడ లేదు.

"చెప్పండి మీకెలా తెలుసు?" రంగధామ్ రెట్టించి అడిగాడు.

"చెబుతాను. మీరంతా ఆ దీపాన్ని పెద్దది చేయాలనుకుంటున్నారు కదూ?" అన్నాడు శేఖరం వాళ్ళ మనసుల్ని చదివినట్లు.

ఆశ్చర్యంతో శేఖరంవేపు చూచారు. అంతే! ముఖాల్లో భయమంతా కూడ గట్టుకొనుంది అందర్లో...

"నేనే ఆ బిడ్డని...దయ్యంబిడ్డని..."

శేఖరం చేయి పొడుగ్గా పొడుగ్గా పెరిగిపోతోంది. దీపం అందుకునేంత పొడుగ్గా...